నమస్తే తెలంగాణ
4
హైదరాబాద్
శుక్రవారం 21 మార్చి 2025
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# దళితులపై దాష్టీకం

**రాజుల** కాలంలోనూ ధర్మ ప్రభువులుండేవారు. ప్రజలను కన్న బిడ్డలుగా చూసుకునేవారు. బీదసాదల పట్ల ఆదరణ చూపేవారు. అలాంటి వారిని ధర్మప్రభువులని ఇప్పటికీ చరిత్రలో చెప్పుకొంటాం. మనం ఇప్పుడు ఆధునిక, ప్రజాస్వామిక యుగంలో ఉన్నాం. ఇప్పుడు ప్రజానుకూలత అనేది ఓ అదనపు లక్షణం కాదు, ప్రధాన లక్షణమే అని చెప్పాల్సిన పనిలేదు. అట్టడుగువర్గాల పట్ల సున్నితమైన స్పందన కూడా అంతే. కానీ, ఆధిపత్య భావజాలం ఇంకా వీడని రేవంత్‌రెడ్డి వంటి వారి విషయంలో మనం కొన్ని సమస్యలను ఎదుర్కొంటుంటాం. వారి మాటల్లో, చేతల్లో వివక్షలు పొడసూపుతుంటాయి. పైవాళ్లు, కిందివాళ్లు అనే విభజనల గురించిన ప్రస్తావనలు వస్తుంటాయి. దళిత, బహుజనుల గురించి మాట్లాడాల్సి వచ్చిన సందర్భాల్లో తెలియకుండానే తన భావజాలపు నీడలు బయటకు పొకుతుంటాయి.


కేవలం సీఎంను పరుషంగా విమర్శించారనే అక్కసుతో ఓ దళితుడు, అందులోనూ డెబ్బయ్యో వడిలో ఉన్న వృద్ధ రైతును అన్నం తింటుండగా పెడరెక్కలు విరిచి పట్టుకుపోయిన ఉదంతం ఈ ధోరణికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. ఆయన కడుపు మండి యూట్యూబర్ ముందు వాపోతే ఆయనకు చెందిన అసైన్డ్ భూమిని సర్కారు లాగేసుకున్నదన్న సంగతి మరుగున పడిపోయింది. సర్కారు కాఠిన్యం వల్ల ఆయన ఆక్రోశమే మెడకు చుట్టుకున్నది. ఆయన ఓ ఉగ్రవాది కాడు. హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న హంతకుడు అసలే కాదు. ఏమిటీ దాష్టీకం? ఎందుకూ దౌర్జన్యం? ఓ సామాన్య, నిస్సహాయ, వృద్ధ దళిత రైతు మీద ఇంతటి ప్రతాపమా? ప్రజా పరిపాలన పేరిట సీఎం సాగిస్తున్న ప్రజావ్యతిరేక పాలన మీద యూట్యూబర్లు చేస్తున్న కార్యక్రమాల మీదా ప్రభుత్వం విరుచుకుపడుతున్నది. ఇద్దరు మహిళా యూట్యూబర్లను అరెస్టు చేసిన సంగతి విదితమే. సీఎం సొంత ఇలాకాలో, సొంత ఊరిలో మహిళా జర్నలిస్టులపై ఘాతుక దాడి జరిగిన సంగతి మనం మరిచిపోలేం. అసలేం జరుగుతున్నది. ఇందిరమ్మ పాలన మాటున మళ్లీ ఎమర్జెన్సీ రోజులను చూస్తున్నామా? సీఎం రేవంత్ రెడ్డి దుర్భర, దుస్సాహస బూతుపురాణం మాటేమిటి? అర్థరహితమైన ఆ అనర్థ సంభాషణలకు ఎవరు జవాబుదారీ వహిస్తారు?

ఇది ఓ దర్శనం వెంకటయ్య కథ కాదు. రాష్ట్రంలోని దళిత, బహుజనులను బాధిస్తున్న, వేధిస్తున్న సమస్య. దళిత తహసీల్దార్‌కే కాంగ్రెస్ నేతల నుంచి రక్షణ లేకపోతే సామాన్యుల మాట చెప్పేదేమిటి? ఎస్సీలను కించపరుస్తూ మాట్లాడే కాంగ్రెస్ నేతలను అదుపు చేసేదెవ్వరు? దళిత ఎమ్మెల్యేలపై పోలీసులు ప్రతాపం చూపితే ఆపేదెవ్వరు? అంతెందుకు, యాదగిరీశుడి సన్నిధిలో దళిత వర్గానికి చెందిన డిప్యూటీ సీఎంకు చిన్నపీట వేసిన పెద్దలను అడ్డుకునేదెవ్వరు? గుట్టుగా దళిత గురుకులాలకు కోత వేస్తే ఎవరేం చేయగలిగారు? దళిత జవాన్‌పై దాడి జరిగితే రక్షణగా నిలిచిందెవ్వరు? ఇటీవల దళిత బిడ్డల గురించి అవమానకరమైన రీతిలో సీఎం మాట్లాడితే నిలదీసిందెవ్వరు? యథారాజా తథాప్రజా అన్నట్టుగా పోలీసులూ, యంత్రాంగం అదే దోవన పోతుంటాయి. ఫలితంగా కష్టజీవులు, అట్టడుగు వర్గాలు యాతనల పాలవుతుంటారు. ఇదీ కాంగ్రెస్ తెచ్చిన మార్పు అనుకోవాలా? సీఎం రేవంత్‌రెడ్డి మార్కు అనుకోవాలా?

---

**మహిళలు, అప్పుడప్పుడు పురుషుల దుస్తులు కూడా విప్పించి ఊరేగించడం మన దేశంలో తరచూ జరుగుతూనే ఉంటాయి. మతం, కులం, వర్గం మధ్య సంఘర్షణలు జరిగినప్పుడు ఆ మొత్తం మతం, కులం లేదా వర్గానికి ఉండే పరువు ప్రతిష్ఠలకు మహిళ శరీరం ప్రతిరూపంగా మారుతుంది. ఆ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిందని భావించినప్పుడు మహిళలను వివస్త్రలను చేసి అవమానిస్తుంటారు. సంఘ విద్రోహ శక్తులు ఇలాంటి నేరాలకు పాల్పడుతూ ఉంటాయి. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూ ఉండటం చూస్తున్నాం.**

## వాక్ స్వాతంత్య్రంపై కత్తి



సీఎం రేవంత్ తన పరువుకు భంగం వాటిల్లిందని చెప్తూ ఇద్దరు మహిళా జర్నలిస్టులను బట్ట లూడదీసి కొడతామని సాక్షాత్తూ అసెంబ్లీలోనే బెదిరించడం దిగ్భ్రాంతిని కలిగించింది. మార్చి 1న రేవంత్ అసెంబ్లీలో మాట్లాడుతూ తన కుటుంబంలోని మహిళలపై అసభ్యంగా మాట్లాడేవారిని 'బట్ట లూడదీసి ఊరేగిస్తామని' హెచ్చరించారు. సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వాక్ స్వాతంత్య్రాన్ని ఉల్లంఘించడమే. రేవంత్ చేసిన ఈ హెచ్చరిక తాలిబన్లను తలపించింది. సీఎంకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేసినందుకు ఇద్దరు మహిళా జర్నలిస్టులు రేవతి పొగడదండ, తన్వీ యాదవ్ అరెస్టయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవతి, తన్వీ షేర్ చేసిన వీడియోలో రేవంత్‌రెడ్డి, వారి కుటుంబంలోని మహిళలను దుర్భాషలాడారు. ఇది రేవంత్‌కు కోపం తెప్పించింది. జర్నలిజం ముసుగులో సోషల్ మీడియాలో తన కుటుంబంపైనా ఇలాంటి తిట్లను సహించబోనని ఆయన హెచ్చరించారు. అధికారిక గుర్తింపు లేకుండా ఆన్‌లైన్ జర్నలిజంలో ఉన్నవారి విషయంలో భిన్నంగా వ్యవహరిస్తామన్నారు. గుర్తింపు పొందిన జర్నలిస్టుల జాబితాను ఇవ్వాలని జర్నలిస్టు సంఘాలను కోరారు. ఆ ఇద్దరు మహిళా జర్నలిస్టులను ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ రెచ్చగొట్టిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

మహిళా జర్నలిస్టుల అరెస్టుపై బీఆర్ఎస్, బీజేపీ తీవ్రంగా స్పందించాయి. రేవంత్ చర్యలు 1975 నాటి ఎమర్జెన్సీని తలపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఓ వీడియోను షేర్ చేస్తూ.. కాంగ్రెస్ డీఎన్ఏ, ఎమర్జెన్సీని ప్రస్తావించారు. 'కాంగ్రెస్ పార్టీ సీఎం భాష ఇదేనా?' అని ప్రశ్నించారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ పత్రికాస్వేచ్ఛ, ప్రేమ, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతారని, ప్రజాస్వామ్యానికి నిర్వచనం ఇదేనా? అని నిలదీశారు. ఇదేనా 'ముహబ్బత్ కీ దుకాణ్?' అని పూనావాలా ప్రశ్నించారు. జర్నలిస్టులను ఉద్దేశిస్తూ సభలో సీఎం అన్ పార్లమెంట రీ భాష వాడారు. ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం రాజకీయాల్లో సాధారణ విషయమే. సీఎం తన కుటుంబాన్ని రాష్ట్ర ప్రజల కంటే ఎక్కువగా భావించడమే ఆందోళన కలిగిస్తున్నది. గత ప్రభుత్వంలో రేవంత్ ప్రతిపక్ష నేతగా బీఆర్ఎస్‌ను బలంగా ఢీకొట్టారు. 2021 అక్టోబర్‌లో నాటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లను 'తాలిబన్'ల తో పోల్చారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఇప్పుడదే నాయకుడు విమర్శిస్తున్న వారి గొంతులను మూసి వేయించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తుండ టం విడ్డూరం. అధికారంలో ఉన్న పార్టీకి పోలీసులపై నియంత్రణ ఉం టుంది. ఈ అధికారం పనికి మాలిన కేసుల్లో ప్రత్యర్థులను ఇరికించడానికి వీలు కల్పిస్తుంది.

ప్రభుత్వం తన పౌరులకు భద్రత కల్పించాలి. అయితే, ముఖ్యమంత్రి స్వయంగా వాక్ స్వాతంత్య్రాన్ని అణచివేస్తామని బహిరంగ బెదిరింపులకు దిగడం, అసమ్మతిని అణచివేయడానికి తాలిబన్ల వంటి ఆదేశాలను జారీ చేసినప్పుడు అది ప్రజాస్వామ్య సంస్థలను అపహాస్యం చేస్తుంది. ఇలాంటివేవైనా జరిగినప్పుడు న్యాయస్థానాలు నిర్ణయం తీసుకుంటాయి. అయితే, పరిష్కారం ఆలస్యంగా రావడంతో అప్పటికే బాధితుడి శారీరక, ఆర్థిక, మానసిక స్థితికి తీరని నష్టం జరుగుతుంది. పౌరులు తమ అభిప్రాయం చెప్పినందుకు బెదిరించడం ద్వారా రేవంత్‌రెడ్డి వాక్ స్వాతంత్య్రాన్ని అణచివేసే ప్రయత్నం చేసి దోషిగా నిలబడ్డారు. రాజ్యాంగం తన పౌరులకు స్వేచ్ఛ, వాక్ స్వాతంత్య్రాన్నిస్తుంది. అయితే, దీనికి కొన్ని పరిమితులున్నాయి. దాన్ని న్యాయప్రక్రియ ద్వారా నిర్ణయించడం ఉత్తమం. ఐదు రోజుల కస్టడీ తర్వాత మార్చి 17న ఇద్దరు మహిళా జర్నలిస్టులకు బెయిల్ మంజూరైంది. నేరపూరిత కుట్ర, ద్వేషాన్ని ప్రోత్సహించడం, భారత చట్టం ప్రకారం అసభ్య విషయాలను ప్రచురించడం వంటి తీవ్రమైన అభియోగాలను వారు ఎదుర్కొంటున్నారు. దోషులుగా తేలితే, వారికి జైలు శిక్ష విధించవచ్చు, ఇది కఠినంగా అనిపించవచ్చు. పరువు నష్టం కేసులను అర్థం చేసుకోవచ్చు కానీ, అరెస్టు, బెదిరింపులను అర్థం చేసుకోగలమా?

**ప్రభుత్వం ఆమోదించిన జర్నలిస్టులనే గుర్తించాలని సీఎం కోరుకుంటున్నారు. జర్నలిస్టుల అధికారిక జాబితాను రూపొందించాలని, జాబితాలో లేనివారిని నేరస్థులుగా పరిగణించాలన్నారు. దీని అర్థం సాధారణ పౌరులకు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే స్వేచ్ఛ లేదనుకోవాలా? ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19కి విరుద్ధం కాదా? సీఎం చేసిన దారుణమైన వ్యాఖ్యలు ఆయన ఫ్రస్ట్రేషన్ నుంచి వచ్చినవని కొందరంటున్నారు.**

కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్య్రాన్ని అడ్డుకుంటున్నదని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకత్వం.. తొలుత తన ఇంటిని చక్కదిద్దుకోవాలి. సోషల్‌మీడియా యుగంలో దూషణలు, ట్రోలింగ్ ప్రజా జీవితంలో భాగమైపోయాయి. అలాగని ప్రజాస్వామ్యంలో గొంతులను అణచివేయలేం. దానికి ప్రత్యేకంగా చట్టం ఉన్నది. ఇందుకు సంబంధించి చరిత్రలో చాలా పాఠాలున్నాయి. ఉన్నత కులాలకు చెందిన పురుషులు తనపై అత్యాచారం చేసి అవమానించినందుకు బందిపోటు రాణి పూలన్‌దేవి బెహమాయి ఊచకోత ద్వారా ప్రతీకారం తీర్చుకున్నట్టు చరిత్ర. మణిపూర్‌లో తాజాగా మహిళలను వివస్త్రను చేసి ఊరేగించిన ఘటనలను కూడా దేశం చూసింది.

**- భారతి మిశ్రానాథ్,** ఎన్డీటీవీ సౌజన్యంతో...


---

# అంకెలతో కూడా అబద్ధాలేనా?



**డి.పాపారావు**
**98661 79615**

**కాంగ్రెస్ తలచుకుంటే కానిదేముంటుంది? అందులోనూ అది రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అయినప్పుడు. మన మామూలు ఇంద్రియాలకూ.. వాటికి అందే లెక్కలకూ.. రెండు రెండ్లు అంటే నాలుగు అని అర్థం. లేదు 10 +10=20 అనేది నిజం. కానీ, సాధారణ గణితశాస్త్ర సూత్రాలకు ఆవల, అబద్ధాల ఫ్యాక్టరీలో మరో తర్కం ఉన్నది. సంవత్సరం తరబడి.. ఆ మాటకు వస్తే మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు అనేక మాసాల ముందునుంచి గంటకో రకంగా మాట్లాడుతూ... రాష్ట్రం అప్పుల గురించీ, సృష్టించిన ఆస్తుల గురించి అతిశయోక్తులు, అంతులేని అబద్ధాలు మాట్లాడుతూ నడిపిన కుతర్కంతో కాంగ్రెస్ పార్టీని రేవంత్ అధికారంలోకి తెచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చాక కూడా అదే వ్యక్తిత్వం ఆయనను విడదీయలేని నీడగా వెంటాడుతూనే ఉన్నది.**



రైతు బంధును, రైతు భరోసాగా మార్చి కేసీఆర్ ఇస్తున్న రూ.10 వేల బదులు తాను రూ.15 వేలు ఇస్తానంటూ ఆకాశంలో మబ్బులు చూసి ముంత పారబోసుకునేలా పేద రైతులను మభ్యపెట్టారు. కాగా, నేడు అధికారంలో కూర్చున్నాక, తన రెండో బడ్జెట్‌లో - రూ.15 వేలు కాదు తూచ్, రూ.12 వేలతో సర్దుకోండంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. మరి ఆ మాటకు వస్తే, స్వయంగా కేసీఆరే తిరిగి ఎన్నికల్లో అధికారంలోకి వస్తే తామే స్వయంగా రైతుబంధు డబ్బును రూ.12 వేలకు పెంచుతామంటూ చేసిన వాగ్దానాన్ని ఇక్కడ ఒకసారి గుర్తుచేసుకోవచ్చు. కానీ, అదనంగా మరో రూ.3 వేలకు రేవంత్ చేసిన వాగ్దానం నేడు తెలంగాణ కొంప ముంచింది.

**అలాగే, అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న (2023) రూ.2 లక్షల మేరకు రైతు రుణమాఫీ చేస్తానంటూ మరో వాగ్దానం చేశారు రేవంత్. అది చాలదన్నట్టు, రుణమాఫీ చేస్తున్నాను కనుక వీలైతే వెళ్లి బ్యాంక్‌లో అప్పు తీసేసుకోండి అంటూ రైతులకు ఉచిత సలహాలు ఇచ్చారు. ఇక వీటితో పాటుగా ఆరు గ్యారెంటీలతో తెలంగాణ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. చివరికి నేడు బడ్జెట్ మీద బడ్జెట్ పడుతున్నా, జనాల ఆశలు అడియాసలుగా మిగిలిపోతున్నాయి. ఆకాశంలో మబ్బులు చూసి ముంత పారబోసుకున్న విధంగా నేడు తెలంగాణ పేద రైతు పరిస్థితీ.. ముసలి పింఛనర్ల దుస్థితి, నిరుద్యోగ యువకుల జీవితాలు మిగిలిపోయాయి.**

వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ చరిత్రే మాయ మాటలు.. మభ్య పెట్టడంతో సాగింది. దీనికి తార్కాణమే, 1960లోనే, నాటి సోషలిస్ట్ నాయకుడు రామ్‌మనోహర్ లోహియా కాంగ్రెస్ పార్టీ గురించి చెప్పిన మాటలు 'తక్షణ ప్రయోజనాలను పొందటానికి దీర్ఘకాలిక పర్యవసానాలను లెక్కచేయనితనం కాంగ్రెస్ పార్టీది'. అదీ కథ. అంటే, అధికారం కోసం అడ్డదారులు తొక్కడం కాంగ్రెస్ పార్టీకి షరా మామూలే. ఇదంతా పాత కథ. ఈ కథ తాలుకు ప్రస్తుత ఎపిసోడ్‌లో రాహుల్ నేతృత్వంలో రాష్ట్రానికి ఓ రకంగా, 5, 6, 7, రకాలుగా గ్యారెంటీలు ఇచ్చుకుంటూ కాంగ్రెస్ రథం కదులుతుంది. కానీ, ఇటు తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అటు కర్ణాటకలో 5 గ్యారెంటీలు ఇచ్చారు. కానీ, అమలు జరుగుతున్న దాఖలా లేకే ఆఖరికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్వయంగా ఈ గ్యారెంటీల వ్యవహారం ఏమీ బాగున్నట్టు లేదంటూ మొన్నీ మధ్య ముక్తాయించారు. అంటే, కాంగ్రెస్ పెద్దాయనకే, ఆ పార్టీ నేతల అబద్ధాలు వెగటు పుట్టే స్థాయికి చేరుకున్నాయి. ఇక ప్రస్తుతం ఈ అబద్ధాలకు, గంట క్రితం తానేం మాట్లాడాడో కూడా మర్చిపోయే సత్తా ఉన్న మన ముఖ్యమంత్రి శక్తి సామర్థ్యాలు తోడయ్యాయి. ఇంకేం కథ రక్తసిక్తమవుతుంది. తెలంగాణ ప్రజల కష్టాలు, కన్నీళ్లతో నేడు మరోసారి ఈ నేల తల్లడిల్లుతుంది.

ఈ కారణం చేతనే, నేడు దేశంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా కేవలం 15 నెలల్లోనే.. ఆ మాటకు వస్తే మొదటి ఆరు నెలలలోపే జనాల ఆగ్రహానికి.. అసహ్యానికి, వ్యతిరేకతకు ఈ ప్రభుత్వం లక్ష్యమైంది. ఈ క్రమంలోనే నిన్నా మొన్నటి బడ్జెట్‌లో కూడా మరుగుజ్జులు వెంపలి చెట్టుకు నిచ్చెనలు వేసినట్టు ఒక ప్రక్కన గతేడాది బడ్జెట్ తాలూకు రూ.2,91,000 కోట్లలోనే రూ.71,000 కోట్ల మేరకు కోత పడిందని చెప్పుకొంటూనే అంటే గతేడాది బడ్జెట్ అసలు సైజు రూ.2,20,000 కోట్లు అంటూనే, మరో ప్రక్కన నేడు రూ.3,04,000 కోట్ల సూపర్ సైజ్‌తో రికార్డ్ స్థాయి బడ్జెట్‌ను వేసిన దుస్సాహసం ప్రభుత్వానిది.

దీనికిముందు మరో విషయం - 2024లో బడ్జెట్ వేసే క్రమంలో -అంతకుముందరి టీఆర్ఎస్ బడ్జెట్‌ను విమర్శిస్తూ ఆ బడ్జెట్‌లు వాస్తవానికి దూరంగా ఉన్నాయనీ, అవి తాము వేసిన అంచనాలను చేరుకోలేకపోయాయని రేవంత్ ప్రభుత్వం విమర్శించింది. దీనిలో భాగంగానే, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ అంచనాలు. కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని, అతిగా అంచనా వేసుకున్నదని.. అటువంటి పొరపాట్లు తాము చేయబోమని రేవంత్ రెడ్డి చెప్పుకున్నారు. ఉన్నది ఉన్నట్టు మధింపు చేసుకుని వాస్తవాలకు అనుగుణంగా, అతిశయోక్తులు లేకుండా బడ్జెట్ ప్రవేశపెడుతామంటూ చెప్పుకొన్నారు. కాగా, ఈ 15 నెలల కాలంలో ఏ అంచనాను కూడా సరిగా వేయలేక పోవడమే కాకుండా కేసీఆర్ సాధించిన విజయాలను కూడా నేడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్వపక్షం చేస్తుంది. ఫలితంగానే నేడు తెలంగాణలో తిరిగి రైతు ఆత్మహత్యలు, చేనేత కార్మికుల కడగండ్లు, నిరుద్యోగ యువతకు ఉపాధి వ్యథలు, దగాపడ్డ మహిళల దిక్కుతోచని స్థితి కనపడుతున్నాయి.

**దీనంతటిలో భాగంగానే, నేడు ఈ బడ్జెట్ 6 గ్యారెంటీలకు కేవలం రూ.59,000 కోట్ల చిల్లర కేటాయించి, పండుగ చేసుకోండి అంటూ జనాలకు సెలవిస్తున్నది. కాగా, గత బడ్జెట్‌లో ఈ గ్యారెంటీలకు రూ.53,000 కోట్ల మేర కేటాయించారు. దీనినైనా పక్కాగా బడ్జెట్‌లో గ్యారెంటీలకు ఖర్చుపెట్టిన దాఖలాలు లేవు. వాస్తవంలో ఇప్పటికీ అమలు జరిగిన గ్యారెంటీ ఏదైనా ఉందంటే 'అది కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే. - మిగతా పథకాలన్నీ, అరకొరగానో.. అసలు అమలుకాకుండానో మిగిలిపోయాయి.**

అదేమిటని ప్రశ్నిస్తే, కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసి పోయిందంటూ అబద్ధాల పరంపరలో మరో అబద్ధం రేవంత్ రెడ్డి సొంతం. అయితే, అసెంబ్లీ సాక్షిగా నాడు కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులంటూ శ్వేతపత్రాన్ని విడుదల చేసిన నాడూ.. నాటి నుంచి నేటి వరకూ అసెంబ్లీలోనూ బయట, పదే పదే అదే అబద్ధాన్ని వల్లె వేసినాడు కూడా. ఆర్బీఐ, కాగ్ అధికారిక గణాంకాలను ఉటంకిస్తూ ఎన్నిసార్లు, ఈ ఆరోపణలకు జవాబు చెప్పినా తగ్గేదేలే అన్నది రేవంత్ తీరు. విషయం జనాలకు అర్థమైందని కూడా, బహుశా ఆయన గ్రహిస్తున్నట్టు లేరు. ఏకపక్షంగా తన ధోరణిలో తాను తిట్ల దండకంతో కలగలుపుతూ అంకెల అబద్ధాల కషాయాన్ని కూడా ఇంకా జనం గొంతులో పోయాలని ఆయన చూస్తున్నారు. అదీ ఇదీ అని కాదు, ఇచ్చిన ఏ వాగ్దానాన్ని కూడా నిలబెట్టుకోని రేవంత్ కాంగ్రెస్ ప్రస్తుతం బీసీ జనోద్ధరణకు కులగణన చేశానంటూ, చెప్పుకుంటూ.. ఆ సర్వే నివేదిక సిరా చుక్కలు ఇంకా ఆరకముందే బీసీలను దగా చేస్తూ, ఈ బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేవలం రూ.11,000 కోట్లకు కొద్దిగా పైనే కేటాయించింది. కాగా, గత సంవత్సరం బడ్జెట్‌లో ఈ కేటాయింపు రూ.8 వేల కోట్లు మాత్రమే. ఇక ఇప్పుడు గుర్తుచేయాల్సిన హైలైట్ 'కామారెడ్డిలో.. బీసీ డిక్లరేషన్ పేరిట ప్రకటించిన బీసీలకు ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ.20,000 కోట్లు కేటాయిస్తామన్న వాగ్దానాన్ని. అంటే, వాగ్దానాన్ని గత బడ్జెట్‌లో కాక, ప్రస్తుతం బీసీల కోసం కులగణన పూర్తి చేయాలని చెప్తున్న ఈ బడ్జెట్ ముంగిటిలో కూడా పరిహాసమే చేశారు. అదీ విషయం.

మరో అంశం నిరుద్యోగ భృతికి సంబంధించినది. ఖమ్మం యూత్ డిక్లరేషన్ పేరిట -నిరుద్యోగ యువతకు భృతి కింద రూ.4 వేలు ఇస్తామంటూ స్వయానా ప్రియాంకా గాంధీ ప్రకటించి వెళ్లారు. అయితే, అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే మన భట్టి విక్రమార్క గారు నిరుద్యోగ భృతి ఇస్తమని చెప్పలేదని ముక్తాయించి ఊరుకున్నారు. వాగ్దానభంగాల పరంపరలో ఇదో మైలురాయి. అయితే, నిరుద్యోగ యువత అందరి సంగతి ఏమో కానీ, మా కార్యకర్తలకు మాత్రం న్యాయం చేస్తామంటూ రాజీవ్ యువ వికాసం పేరిట, సోనియాగాంధీని మెప్పించే పథకం ఒక దానిని ప్రస్తుత బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు.

**కాకపోగా, అన్ని వాగ్దానాలను భంగపర్చి ప్రజల్లో అవమానాన్ని, అపకీర్తిని మూటగట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ప్రస్తుతం ఈ రాజీవ్ యువ వికాసం పట్ల పెద్దగా ఉత్సాహంగా ఉంటారని నేననుకోను. పార్టీలోని పెద్ద నాయకులు అంటే పాలకుల స్థాయిలో ఉన్నవారి అవకతవకలు, ఆలోచనరహిత తీరుకు తాము జనాలలో జవాబు చెప్పుకోవాల్సి రావడం, ప్రస్తుతం కార్యకర్తలకు బహుశా గతంలో ఎప్పుడూ లేనంతటి పెద్ద సమస్యగా తయారైంది.**

'పీఎస్' అధికారంలోకి వచ్చిన ఈ 15 నెలల కాలంలో.. ప్రభుత్వ ఆదాయం దారుణంగా పడిపోయినా, అదంతా ఏమీ పట్టనట్టు రికార్డు స్థాయి బడ్జెట్ మళ్లీ వేసిన ఈ కాంగ్రెస్ పార్టీ నాయకులకు తాము ఆ ఖర్చులకు డబ్బు ఎలా సమకూర్చుకుంటామో చెప్పే విజ్ఞత కూడా కొరవడింది. అంటే, నేటి తెలంగాణ ఆర్థిక పరిస్థితిని వీళ్లు గాలిలో దీపంలా మార్చి.. 'దేవుడా.. నీవే దిక్కు' అనుకోమంటున్నారు. గుడ్డేటుగానో, గాలివాటుగానో.. మంచే జరుగుతుందని మనల్ని నమ్మమంటున్నారు. ఈ పాలన ఇంకా మూడున్నరేండ్లు ఉన్నది. నిజంగానే తెలంగాణకు నీవే దిక్కు దేవుడా...

**(వ్యాసకర్త: ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు)**

**కాంగ్రెస్ ప్రస్తు తం బీసీ జనోద్ధరణకు కులగణన చేశానంటూ, చెప్పుకుంటూ.. ఆ సర్వే నివేదిక సిరా చుక్కలు ఇంకా ఆరకముందే బీసీలను దగా చేస్తూ, ఈ బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేవలం రూ.11,000 కోట్లకు కొద్దిగా పైనే కేటాయించింది. కాగా, గత సంవత్సరం బడ్జెట్‌లో ఈ కేటాయింపు రూ.8 వేల కోట్లు మాత్రమే. ఇక ఇప్పుడు గుర్తుచేయాల్సిన హైలైట్ 'కామారెడ్డిలో.. బీసీ డిక్లరేషన్ పేరిట ప్రకటించిన బీసీలకు ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ.20,000 కోట్లు కేటాయిస్తామన్న వాగ్దానాన్ని. అంటే, వాగ్దానాన్ని గత బడ్జెట్‌లో కాక, ప్రస్తుతం బీసీల కోసం కులగణన పూర్తిచేయాలని చెప్తున్న ఈ బడ్జెట్ ముంగిటిలో కూడా పరిహాసమే చేశారు. అదీ విషయం.**

---




## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలి

**ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బతుకుల్లో మార్పు రావడం లేదు. ఉద్యోగులే కాదు, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి బాగోలేక, చాలీచాలని జీతాలతో బతుకలేక ఎంతోమంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మరణించారు. ఇప్పటికీ ఆ కుటుంబాలకు ఎటువంటి న్యాయం జరగలేదు. ఒక్కసారి జీతం అరకొర పెంచినా, అదే జీతంతో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాం. ఎప్పటికైనా ఈ తెలంగాణలో మా జీవితాలు బాగుపడుతాయని ఆశ పడ్డం. అయినా కూడా ఇప్పటికీ మా బతుకుల్లో ఎటువంటి మార్పు రాలేదు.**



ఎప్పటికైనా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలు మారుతాయని ఉద్యోగుల ఆశతో బతుకుతున్నారు. అంతెందుకు మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఏజెన్సీ వ్యవస్థని రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి మొదటి తేదిన జీతాలు ఇస్తున్నారు. అందరికీ ఉద్యోగ భద్రత ఇచ్చారు. కానీ మార్పు పేరిట ఏమార్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మాత్రం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పట్టించుకోవడం లేదు. దీంతో వారి పరిస్థితి దారుణంగా ఉన్నది.


ఈ రాష్ట్రంలో ఉన్న ఎందరో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను బలి తీసుకుంటున్న ఏజెన్సీ వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలి. గవర్నమెంట్ ఏజెన్సీలు మాత్రం ఉద్యోగులకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకుండా, పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ వంటివి కూడా ఉద్యోగి ఖాతాలో జమచేయకుండా ఉద్యోగులని వేధిస్తూ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. అందువల్ల ఏజెన్సీ వ్యవస్థని పూర్తిగా రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు అందించాలి. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రధాన పాత్ర వహిస్తాం కాబట్టి మా శ్రమని గుర్తించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి మా అందరి శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలి. మరీముఖ్యంగా ఉద్యోగ భద్రత లేక ఎప్పుడు ఉంటదో, ఎప్పుడు ఊడుతదో అనే భయంతో బతుకలేక బతుకుతూ జీవనం సాగిస్తున్నాము. భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం కూడా అవసరం ఉన్నన్ని రోజులు పని చేయించుకొని ఇప్పుడు వద్దు అని వారిని రోడ్డు మీదకు నెట్టి వేస్తున్నది. ఇది ఎప్పటికైనా ప్రమాదమే. ఆయా శాఖల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.10 వేల నుంచి రూ.22,500 వరకు నెల వేతనంగా అందుతుంది. దానితో కడుపునింపుకొనే వారికి ఏడెనిమిది నెలలుగా ఏజెన్సీలు వేతనాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తున్నది. నెల తిరిగే సరికే పిల్లల ఫీజులు, ఇతర ఇంటిఖర్చుల నేపథ్యంలో జీవితం భారంగా మారి ఇబ్బంది పడుతున్నారు. చేసిన అప్పులు సకాలంలో చెల్లించకపోవడంతో మరోసారి అప్పు పుట్టని పరిస్థితి. కొంతమంది కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్యల బాట పడుతున్నారు.

ఒకే విధమైన బాధ్యతలు నిర్వహిస్తూ, ఒకే రకమైన పనిచేస్తున్న వ్యక్తికి (ఔట్ సోర్సింగ్ / కాంట్రాక్టు పేరిట)మరొకరి (పర్మినెంట్ ఉద్యోగి) కంటే తక్కువ జీతం ఇవ్వడం కుదరదు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వరంగ/శాఖలలో/సంస్థలలో పనిచేస్తున్న సుమారుగా రెండు లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ (గ్రామ పంచాయతీ నుంచి రాష్ట్ర స్థాయి వరకు) ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించి న్యాయం చేయాలని కోరుతున్నాం.



**పులి లక్ష్మణ్**
**(వ్యాసకర్త: అధ్యక్షులు, రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ)**

---






## టీ షర్టులతో సభకా?

**నియమనిబంధనలతో సభ నడుస్తుంది. సభ్యులు హుందాగా వ్యవహరించాలి. సభా గౌరవప్రతిష్ఠలను కాపాడాలి. కానీ, కొంతమంది సభ్యులు నియమాలను ఉల్లంఘించి నినాదాలు ఉన్న టీషర్టులతో సభకు వస్తున్నారు. ఇది ఆమోదనీయం కాదు. ఎంత పెద్ద నాయకుడైనా సరే, సభా నియమాలను పాటించాల్సిందే.**

**- ఓం బిర్లా, లోక్‌సభ స్పీకర్**